

# ఒంటరి

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

తానా
బహుమతి నవల

# ONTARI

*TANA Prize Winning Novel*

*by* **Sannapureddy Venkataramireddy**
Balarajupalle, Narasapuram Post
Kasinayana Mandalam, Kadapa Dist.-516217
**Email: sannapureddy12@gmail.com**

© Author

***Released***
**On 25th December 2017 at Hyderabad**

*First Publication: December, 2017*
*Publication Number: 8*

*Publication*
**TANA (Telugu Association of North America) Publications**
20374 Buckthorn Court, Mundelein, Illinois, 60060, USA

*Local Address*
AG-2, 'A' Block, Mathrusri Apts., Hyderguda,
Hyderabad-500 029. Ph.: 040-2324 4088

*Cover Painting*
**Vasu**

*Cover Design*
**Akshara Creators,** Hyderabad
Email: sakshara@gmail.com

*Copies available at*
**Visalandhra Publishing House,** Vijayawada and its Branches in Andhra Pradesh; **Navachetana Publishing House,** Hyderabad and its Branches in Telangana; **Navodaya Book House,** Kachiguda, Hyderabad; **Prajashakti Book House,** Hyderabad and its branches in Andhra Pradesh

*e-book:* **www.kinige.com**

*Composed at* **Akshara Creators,** Hyderguda, Hyderabad
Ph.: 040-23244088

*Printed at* **Charita Impressions**
Azamabad Industrial Area, Hyderabad, India.
Ph.: 040-2766 78411

**₹125 $ 10**

# ప్రారంభం

అశ్లేషకార్తె భూమి మీద అడుగులు మోపే సమయానికి నేనీ ఒంటికొట్టం చేరుకొన్నాను.

కాలాన్ని కార్తెలు, ఋతువులతో కొలిచే మనుషులున్న నేల కోసం చాలాకాలం నుంచి వెదుకుతున్నాను. తృణధాన్యాల సాగును మరచిపోని రైతులున్న పల్లెల కోసం చాలా ప్రాంతాలు తిరిగాను. చుట్టూ నాలుగు రాష్ట్రాల్లోని వర్షాధారపు పంటలతో బతికే మెట్టభూములన్నీ తొక్కి చూశాను. శిథిలమై పోతోన్న నా శరీరంలోని జీవకణా లన్నిటికీ తిరిగి ప్రాణశక్తిని అందించగల 'మృతసంజీవని' లాంటి ధాన్యపుపంట ఆనవాళ్లు చాలాకాలం పాటు దొరకలేదు. మహారాష్ట్రలోని ఖండాలాలో ఓ సిద్ధ పురుషుడు చెప్పిన మాటనే కర్ణాటకలోని తలకాడు వద్ద మరో సాధువు ప్రతి పలకటంతో వెదకాలనే పట్టుదల పెరిగింది.

అంతర్జాలంలో శోధిస్తూ వుంటే- తెలంగాణ ప్రాంతంలో ఓ ఔత్సాహిక రైతు పండించిన అనేక తృణధాన్యాల సరసన వాటి పేరు కూడా కనిపించటంతో ప్రాణం లేచి వచ్చినట్లయి వెంటనే రెక్కలు కట్టుకొని అక్కడ వాలాను. ఐదేళ్ల క్రితం ఎప్పుడో అతను పండించిన మాట వాస్తవమేగాని వాటిని ఎట్లా పొట్టు వొలిచి బియ్యం చేయాలో తెలీక, వినియోగించటం అర్థంగాక, వాటి విలువను కూడా అంచనా వేయలేక తిరిగి సాగు చేయలేదుట. అతను విత్తనాలు తెచ్చింది అనంతపురం జిల్లాలో అని తెలిసి కర్ణాటక సరిహద్దులోని ఆ పల్లెలన్నీ గాలించాను. అలా అలా కొండలు గుట్టలు ఎక్కుతూ దిగుతూ కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠం చేరుకొని జేజి నాయనకు మొక్కి బైటకు వస్తోంటే ఓ సాధువు రహస్యంగా చెప్పాడు- నల్లమల కొండల్లోని జ్యోతిక్షేత్రం గురించీ, రైతు రుషి అయిన కాశినాయన ఆశ్రమానికి కార్తెలు ఋతువుల్తో కాలాన్ని లెక్కించే రైతులు వచ్చే విషయాన్ని గురించి.

నాయన ఆశ్రమానికి చేరుకొన్న రెండవరోజే అక్కన్నించి ఈ ఒంటికొట్టం వద్దకు రావలసి వచ్చింది.

అశ్లేషకార్తెలో వచ్చినవాన్ని ఆరునెలలు ఈ మట్టిలోనే పాతుకుపోయి ఉన్నాను. చిన్న పుష్యాలగా పిలువబడే పూర్వాషాఢ కార్తె ఇది. విచ్చుకున్న ఐదురెక్కల తెల్లని పూవులతో ఆకుపచ్చని పిందెలతో కలివె పొదలు అందంగా కనిపించే కాలాన వచ్చాను. నల్లగా నిగనిగలాడే పళ్లతో పరికపొదలూ, ఎరుపు, పసుపురంగు పళ్లతో రేగుచెట్లూ, నాలుకలు సాచే చలిమంటలతో తెల్లారుజాములూ పరవశించిపోయే ఈ కాలాన నేనీ నేలను వదలాల్సిన సమయం వచ్చింది. పొలాన్ని దున్ని విత్తనాలు విత్తి పంట పండించటం వరకే అవధిగా నిర్ణయించుకొని వచ్చాను. కానీ ఇక్కడి ప్రకృతి నా దేహాన్ని రేగడినేలగా మార్చి ఇరవాలు మరవాలుగా దున్ని ఎన్నో పంటలు పండించింది. నేనెన్నడూ ఎరుగని పంటలు ఇవి. నా ఐదు దశాబ్దాల పైగా జీవితంలో ఒకే ఒక రకమైన పంటను పండించి పండించి జనారణ్యంలో దిగ్గజంగా పేరు తెచ్చుకొన్న నేను, ఇన్ని పంటలకు నా దేహం కార్యక్షేత్రమవుతుందని ఊహించలేదు.

నేను పండించిన పంటను కోసుకు పోయేందుకు సిద్ధమై ఉన్నాను. కానీ, నాలో పండిన పంటను కోసి కళ్లం చేసేందుకు ప్రకృతి సిద్ధపడటం లేదు. అది తన ధర్మం కాదని కూడా అంటోంది. ఆ పంట తనకై తను రాలిపోవలసిందేనట.

సిద్ధ పురుషుల నించి నాకెలాంటి సందేశమూ రావటంలేదు.

ప్రశ్నలకు జవాబులు అందటంలేదు.

డబ్బు సంపాదించటం అనే జీవశక్తి ఒక్కటే అనుక్షణం కొత్తదనాన్ని రగిలిస్తూ నా జీవితాన్ని పరుగులు పెట్టించింది. శరీరాన్ని పట్టించుకోకుండా, శరీరం లోపల పరువెత్తే నెత్తుటి వేగాన్ని పట్టించుకోకుండా, శ్వాస గమనాన్ని పట్టించుకోకుండా కేవలం రూపాయి రాకను మాత్రమే కనిపెట్టి ప్రయాణించింది.

ఈ ఆరునెలల జీవితంలో ఎన్నెన్నో కొత్తదనాలు, మరెన్నో జీవశక్తులు నా జీవితాన్ని నడిపించాయి. ఇంతకాలం నిర్లక్ష్యం చేయబడిన శరీరాన్నీ, ఆత్మనూ పట్టించుకొన్నాయి. కొత్త జ్వాల నొకదాన్ని రగిలించాయి.

నేను పండించిన పంటను నాతోబాటు తీసుకెళ్లాలనుకొన్నపుడు నా దేహపు క్షేత్రంలో ప్రకృతి పండించిన పంటల్ని ఇక్కడే వదలి వెళ్లాల్సిన ధర్మం ఒకటి ఉంది.

అదే నా ఈ ప్రయాణానికి అడ్డంకిగా మారింది.

దారికి అడ్డంగా పెద్దపులిలా ఎదురొడ్డి నిలబడింది.

నా కథంతా విన్న తర్వాత మీరయినా ఒక మంచి సలహా ఇవ్వండి.

నా మాటలనిండా కార్తెలు, ఋతువులు, పల్లె జీవితానికి సంబంధించిన సామెతలు దొర్లటానికి కారణం నా ఈ ఆరునెలల మట్టిబతుకేనని అర్థం చేసికొంటే చాలు.

గతంలో నేనొక డబ్బు యంత్రాన్ని.

నా పేరు డాక్టర్ రాఘవ.

# 1

బ్రహ్మంగారి మఠం వద్ద సాధువు చెప్పిన సమాచారం మేరకు కాశినాయన ఆశ్రమం కేసి ప్రయాణించాను.

నా వెదకులాటకు అదే తుదిమెట్టుగా నిర్ణయించుకొన్నాను.

ఆధ్యాత్మిక చింతనతోబాటు బంగేకు చిలుము దమ్ములతో ఒక మార్మికలోకం సృష్టించుకొనే సాధువులూ-

వ్యవసాయానుభవాలతో బాటు కొడుకుల అనాదరణను మోసుకొచ్చిన వృద్ధులూ-

మొక్కుబడులతో బాటు తప్పిపోయి వచ్చి దొడ్లలో చేరిన పశువులూ-

తొలికాపు నైవేద్యరూపంతో బాటు కొని తెచ్చి రాశులుగా పోసిన కూరగాయలూ, ధాన్యమూ-

ఉచితంగా సేవ చేసేందుకు వచ్చిన భక్తులతో కూడుకొన్నదేనట కాశినాయన ఆశ్రమం.

రాత్రింబవళ్లూ, సంవత్సరం పొడవునా ఉచిత అన్నదానం- ఎంతమంది వచ్చినా, ఏ జాముకాడ వచ్చినా విసుక్కోకుండా రుచికరంగా వడ్డించటం అక్కడి ప్రత్యేకతట.

వినటానికే ఆశ్చర్యంగా అనిపించింది.

మల్లెపల్లె దాటి నల్లమల కొండ పాదాల పక్కగా ప్రయాణిస్తూ వచ్చి వరికుంట్ల గ్రామం చేరుకొంది కారు.

అక్కన్నించి కొండల్లోకి ప్రయాణించింది.

దుర్గమారణ్యంలో అడ్డంగా వెళుతూ సిరిమాను చందనం చెట్లతో నిండిన బోళ్లూ, తరమున్నా తాటకూడా కుళ్లని సంద్రమాన్లతో కూడిన కొండలూ, ఎప్పుడూ తేనెటీగల మోతతో ప్రతిధ్వనించే చెలిమబావి, పచ్చని బాకుల్లా పైకి పెరుగుతూ దూసుకొచ్చే వెదురు గుములూ, వంకల్లో అల్లుకుపోయిన పరిక కంప పొదలూ, దారిపైకి గమ్మున వాసనకొట్టే కరివేప గుములూ, పాతకాలపు వేపచెట్లూ, పట్టెడు లావు మాడపు తీగలూ, కొండముచ్చులూ, అడవికోళ్లూ, ఉడుముల కదలికలూ, పెద్దపులుల భయాలూ బాటనిండా కొత్త భావనలు రేకెత్తిస్తూ వుంటే- జ్యోతిక్షేత్రం చేరుకొంది కారు.

అప్పటికి ఉదయం ఎనిమిది గంటలు దాటుతూ వుంది.

డోర్ తీసి కిందకు దిగి వసతి సౌకర్యాలను విచారించేందుకు వెళ్లాడు డ్రైవర్.

నెమ్మదిగా నేలమీద అడుగు మోపాను.

ఎదురుగా ఎత్తయిన రాతి ప్రహరీ, మధ్యలో విశాలమైన ద్వారం. లోపల ఇంకా నిర్మాణం పూర్తిగాని కాశినాయన గుడి.

తూర్పువైపు బిడువులో చింత, ఉసిరిక చెట్ల కింద నేలమీద పడున్న రాతి స్తంభాలు. కొన్ని పూర్తిగా తయారై, మరికొన్ని సగంలోనే ఆగిపోయి...

ఆవరణ నిండా భక్తులే- వచ్చేవాళ్లు వస్తూ వుంటే, పోయేవాళ్లు పోతూ వుంటే...

కార్లు, బైకుల్లో దిగేవాళ్లు కొంత కండపట్టి నాగరీకంగా కన్పిస్తోన్నా-

ట్రాక్టర్లు, ఆటోల్లో వచ్చే యాత్రికులు ఒంట్లో అంతా యేరుకొన్నా పిడికెడు కండ కూడా కనిపించక, కాయకష్టానికి చర్మం నల్లగా కమిలిపోయిన కష్టజీవులే.

డ్రైవర్ వచ్చాడు.

దాతలు కట్టించిన వసతిగృహాలు వున్నాయిట.

కారులోకి దూరబోతూ వుంటే నలుగురు యాచకులు చేయి చాపుతూ వచ్చారు. ఆ వెనకే మరో పదిమంది సిద్ధమై కదలుతూ వున్నారు.

వంద రూపాయల నోటు వాళ్లకు అందించి పంచుకోమని చెప్పాను.

కారు వసతిగృహ సముదాయం కేసి వెళ్లింది.

గది బావుంది. డబుల్ కాట్, కుషన్ బెడ్, మంచినీటి వసతి... బాడుగ వంద రూపాయలే... అదీ నిర్వహణ కోసమే...

కాళ్లు మొగం కడుక్కొని దైవదర్శనానికి బైల్దేరాను.

టెంకాయ వగైరా పూజాసామగ్రి పట్టుకొచ్చాడు డ్రైవర్.

విశాలమైన గుడి. గోడల నిండా అద్భుతమైన శిల్పసంపద... ఆధ్యాత్మిక భావన ఉట్టిపడేలా- పురాణకాలం నించి ఇప్పటిదాకా యీ నేలమీద తిరుగాడిన అవధూతల శిల్పాలు...

సింహద్వారం నించి లోపలికి పోతే- సగం పూర్తయి కనిపించే దేవాలయం. అరవై తెలుగు సంవత్సరాలకు ప్రతీకగా అరవై రాతిస్తంభాలను నిలబెట్టి, వాటిపైన రాతిపలకలతో పైకప్పు నిర్మాణం...

పూర్వమెప్పుడో రాజుల కాలంలో చేయాల్సిన పనిని ఇప్పుడు రైతులు చేయటం ఆశ్చర్యకరమే!

కాశినాయన సమాధి వున్న గర్భగుడి ముందు టెంకాయ కొట్టి మొక్కొని బైట పడ్డాను.

నాయన సమాధిలోకెళ్లి ఇరవై యేళ్లయిందట.

ఇరవైయేళ్ల క్రితం యీ పల్లెలన్నీ తిరుగుతుండేవాడుట. చుట్టుపక్కల జిల్లాలన్నీ సంచరిస్తూ వుండేవాడుట.

అంటే- ముప్ఫైయేళ్లకు పైగా వయసున్న వాళ్లంతా ఆయనను చూసే ఉంటారు. ఇక్కడికి వచ్చిన భక్తుల్లో మూడు భాగాలమందికి పైగా ఆయన్ను ఎరిగిన వాళ్లే అయ్యుంటారు.

ఏదో వ్యక్తీకరణకు దొరకని భావన ఒకటి మనస్సులో కదలాడింది.

కొంతసేపయింతర్వాత అక్కడ్నించి కదిలాను.

కాశినాయన మహత్మ్యాలు తెలిసికోవటం కాదు ప్రస్తుతం జరగాల్సిన అన్వేషణ- మృతసంజీవని ధాన్యం కోసం.

అందరినీ పరిశీలనగా చూస్తున్నాను.

రైతులుగా కనిపించే వాళ్ల దగ్గర చేరుకొని పరిచయం చేసికొని ప్రశ్నలు సంధిస్తున్నాను.

గోచిపంచె కట్టిన ముసలాళ్లను ఎవ్వరినీ వదలటంలేదు.

గుడిలోంచి బైటకొచ్చిన తర్వాత కూడా ట్రాక్టర్ల వద్దా, ఆటోల వద్దా ఉన్న జనాలను కదిలించి చూశాను.

విసుగు లేకుండా విచారణ చేస్తూనే ఉన్నాను.

విరామం లేకుండా అన్వేషిస్తూనే ఉన్నాను.

ఒక తరం కిందట తప్పిపోయిన ధాన్యపుగింజల ఆచూకీ తెలిసికోవాలనే తపన తగ్గిపోనీకుండా నన్ను నేను ఉత్సాహపరచుకొంటున్నాను.

యాభై యేళ్లు దాటిన మెట్టభూములోల్లంతా వాటితో తమకున్న పరిచయాన్ని గురించి తెలుపుతున్నారు. తమ బాల్యంలో బరక భూముల వాళ్లందరికీ అది ప్రధాన ఆహారపు పంటగా కూడా ఉండేదని అంటున్నారు. స్మృతుల్ని తడువుకొంటున్నారేగాని వర్తమానంలో దాని ఉనికిని గురించి చెప్పలేకపోతున్నారు.

దక్షిణపు ప్రహరీకి అన్నశాలకూ మధ్యనున్న దారిలో నరసింహస్వామి గుడికేసి నడుస్తున్నాను.

పడమటి కొండకోనల్లోంచి వచ్చిన సెలయేరు ఒకటి దారిపక్కన్నించే తూర్పుగా సాగి ఆగ్నేయమూలగా చెట్లచాటున అదృశ్యమవుతూ కనిపించింది.

వాగు ఒడ్డున్నే వాగంత పురాతనమైన బూరుగమాను ఉంది. ఆకాశాన్ని అర చేయంత కూడా నేలకు దిగకుండా అడ్డుకొని ఉంది. పక్కనే దానికి తగ్గకుండా తాండ్ర మాను పెరిగి ఉంది. వాటి రెండింటికీ కొంత దూరంలో వాగు అవతలి గట్టున వాటితో బాటు పెరిగి ఉన్న మామిడివృక్షం ఉంది. వీటన్నిటికీ పడమరగా వాగు ఇవతలి ఒడ్డున రెండు బూరుగమానులు... అన్నిటినీ నడిమి చేసికొని దక్షిణ ద్వారంతో నిలబడి ఉన్న నరసింహస్వామి గుడి.

క్షేత్రపాలకుడట ఆయన.

కాశినాయన తొలుత ఆయన పాదాల వద్ద ఒరపడే జ్ఞానసిద్ధి పొందాడుట.

ఫాల్గుణ మాసపు పౌర్ణమిరోజుల్లో వందలకొద్దీ భక్తులు ఈ దారిన్నే ప్రయాణించి అనంతరాయడూ, గరుడాద్రి, పాములేటి స్వాముల్ని దర్శించుకొంటూ అహోబిలం తిరుణాలకు వెళతారుట.

తర్వాత ఏడాది పొడువునా ఈ గుడి పెద్దపులులకూ, ఈ మహావృక్షాలు కొండముచ్చులకూ ఆలవాలంగా ఉండేవిట.

నరసింహస్వామికి మొక్కుతూ ఉంటే- ఒక పురాతన మార్మిక భావన, ఏదో తెలీని భయం, మరేదో ఆధ్యాత్మిక భావప్రకంపన...

కొంతసేపు గుడిలోపలే కూచుని బైటకొచ్చాను.

తల వెంట్రుకలు నీళ్లు కారుతూ వుండగా కొబ్బరిముక్కలు, చెక్కెర కలిపిన ప్రసాదాన్ని పళ్లెంలో పెట్టుకొచ్చి అందరితోబాటు నాకూ పంచింది ఓ భక్తురాలు.

కాదనకుండా చేయి చాచాను.

ప్రసాదాన్ని కళ్ల కద్దుకొని డ్రైవర్ చేతిలో పెట్టాను.

గుడికి పడమటి వైపు బూరుగమాని మొదట్లో ఐదుగురు సాధువుల గుంపు కనిపించింది.

అటుకేసి వెళదామని అనుకొనేంతలో నా వెనక ఏదో సన్నని అలజడి వినిపించింది.

"ఓయమ్మో... ఏం పిల్లోనివిరా నువ్వు!" ఎవరిదో ఆడమనిషి సన్నని ఆశ్చర్యపు గొంతు.

వెనుదిరిగి అటుకేసి చూశాను.

అక్కడున్న వాళ్ల చాలామంది కళ్లు మామిడిచెట్టు మొదలు మీద ఉన్నాయి.

చెట్టు బోదెకు పదడుగుల ఎత్తున, ఎండిపోయిన బెరుడుకు కరచుకొని ఉంది ఓ జీవి. ఎర్రటి రంగుతో పొడవాటి కుచ్చుతోకతో, మూరెడు పొడవున్న అందమైన జీవి అది. కదలకుండా మానుకే అంటుకొని ఉంది.

కింద ఓ నల్లటి చప్పిడిముక్కుల పిల్లగాడు, పదేళ్ల వయస్సువాడు పొడవాటి వెదురు బెత్తాన్ని చేతబట్టుకొని ఆ జీవిని ఎగిరెగిరి కొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు.

"మంచి దెబ్బే పడింది. బెత్తరపోయింది. ఇంగో దెబ్బబడ్తే రాలి నేలమీద పడ్తది," ఎవరో అంటున్నారు.

"ఒకదాన్నొకటి తరుంకుంటా సెల్లాట మాడుకుంటా వుండె. పెంటిదాన్ని ఎంటబడ్తా వుండె ఈ పోతుది. యాన్నుంచొచ్చిండో ఈ మిద్దురపోడు ఎంత దెబ్బకొట్టె... జానెడు లేడు... వానెంత ఎత్తు ఎగిరికొట్టె... దెబ్బ బిసన రోంత పైకెక్కిందిగాని ముందుకు పోలేకుంది సూడు... బెట్టుడతలంటమ్మే అవి..." పక్కమనిషికి చెబుతూ ఉంది ఓ ఆడమనిషి.

బెట్టుడత... అందమైన జీవి.

మామిడిచెట్ల పై కొమ్మల్లోకి నిశితంగా చూస్తే... రెమ్మల సందుల్లోంచి తొంగి తొంగి చూస్తూ ఆడజీవి.

రింగుల జుత్తుతో, మాసిన నిక్కరుతో నల్లగా ఉన్న ఆ కుర్రాడు అంతులేని కాంక్షతో ఆ జీవికేసే చూస్తున్నాడు. అది ఇప్పుడో ఇంకాసేపట్లోనో జారి నేలబడుతుందని వాడి ఆశ కాబోలు.

ఆ దృశ్యాన్ని చూసేందుకు జనం పోగవుతున్నారు.

సాధువులు కూడా అక్కడికి వచ్చారు.

బెరడు కరచుకొని ముందుకూ వెనుకకూ ఊగుతూ ఉంది బెట్టుడత.

అంతకంతకూ ఎక్కువవుతోన్న జనాల్ని చూసి, వెదురుబెత్తాన్ని చేతబట్టుకొనే చెట్టు మొదలు కరచుకొన్నాడు కుఱ్ఱాడు.

తన వేటకు ఆటంకం ఏర్పడుతుందేమోనని అనుమానించాడు కాబోలు.

"ఇప్పుడు చూడు వాడు దాన్ని కొట్టేస్తాడు," ఓ సాధువు అంటున్నాడు.

"వాని తిండి వానిది. పోనిస్తాడా?" మరో మనిషి స్పందన.

చెట్టు మొదలు కరచుకొని నాలుగడుగులు పైకెగబాకి దాన్ని మరో దెబ్బ వేసి పడగొట్టాలని వాడి వ్యూహమై ఉంటుంది.

"వానికి ఈరోజు నంజుడు దొరికినట్టే..." అంటున్నారు కొందరు.

రెండడుగులు పాకాడో లేదో, జనాల వెనకనించి, "రేయ్," అంటూ ఒక గర్జన వినిపించింది.

బక్కపల్చటి ముసలాయన ఒకడు సుడిగాలిలా రవరవ నడిచి వచ్చి వాగు గట్టున నిలబడి, "రోయ్! మాను దిగుతావా లేదా?" అంటూ గట్టిగా అరిచాడు. ఆయన గొంతు ఖణేల్‌మని కొండపేట్లల్లో ప్రతిధ్వనించింది. గోచిపంచె కట్టి ఉన్నాడు. తెల్లటి గడ్డం- అరచొక్కా.

"మాను దిగుతావా లేకంటే రాతకొట్టమంటావా? ఒక్క దెబ్బకే చస్తావు నా కొడకా!" అంటూ పట్టెడు లావు రాతిని చేతబట్టుకొని ఊపుతూ ఉంకించాడు.

టక్కున మాను వదిలేసి రెండడుగులు దూరంగా వెళ్లాడు కుఱ్ఱాడు.

"ఏం చేసిందిరా అది? నీ ఇంట్లో జొరబడి కుండలో కూడు తిన్నెదా? నీ బానలోనీల్లు తాగిందే? దాని మానాన అది కొమ్మల్లో రెమ్మల్లో తిరిగి కాయగసురు తిని బతుకుతా ఉంటే దాన్ని చంపబోతావే! ఏ జీవినీ బతకనియ్యర్రా మీరు? వేలెడు లేవు, నీకీ చిన్న వయస్సులోనే ఇంత కర్కశత్వం ఉంటే పెద్దయినాంక నువ్వెంత రాక్షసునివి అవుతావో... పో... దూరంగా పో..." అంటూ చేతిలోని రాతిని ఊపి వాడిపక్కన పడేట్టు విసిరాడు.

బెదిరిపోయి వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ దూరంగా వెళ్లిపోయాడు కుఱ్ఱాడు.

వాడి కళ్లల్లో అంతులేని నిరాశ, దాని వెనకే భయమూ కన్పించాయి నాకు.

అందరూ చూస్తుండగానే ఊగి ఊగి పట్టుదప్పి నేలమీద పడిపోయింది బెట్టుడత.

నీళ్లపాత్రతో వాగులోకి దిగాడు ముసలాయన.

బెట్టుడత మొహాన నీళ్లు చల్లి సేదదీర్చాడు.

కొంతసేపటికి అది కోలుకొని మెల్లిగా చెట్టుపైకి పాకాలని చూసింది. రెండు మూడు ప్రయత్నాల తర్వాత చెట్టును చుట్టుకొంటూ పైకెగబాకి కొమ్మల్లోకి చేరుకొంది.

అప్పటిదాకా కొమ్మల్లోనే దాగి ఉన్న పెంటిజీవి దాని దగ్గరగా వెళ్లింది.

గుడ్లప్పగించి చూస్తుండిపోయారు అందరూ.

"హింస మీకు వినోదంగా ఉందా?" అంటూ హుంకరించాడు ముసలాయన.

ఆయన అక్కన్నించి వెళ్లిన తర్వాత కూడా ఎవరూ నోరెత్తలేదు.

ఆయన చూపిన జీవకారుణ్యానికి సిగ్గుతోనో, మరో భావంతోనో నేను అలాగే నిల్చుండిపోయాను.

అందరి పరిస్థితీ నాలాగే ఉంది కాబోలు.

ఎవరో అంటున్నారు- "కాశినాయన అరిచినట్లే ఉంది... అదే గొంతు... అదే గాంభీర్యం..."

జనాల్ని దాటుకొని ముందుకెళ్లి అటు ఇటు చూశాను.

వెళ్లిపోయినట్టున్నాడు.

ఆశ్రమంలోనే ఎక్కడో ఉంటాడు.

ఆ ముసలాయనను మళ్లీ చూడాలనిపిస్తోంది.

మాట్లాడాలని కోరికగా ఉంది.

డ్రైవర్‌ను వెంటేసుకొని భోజనశాలకు వెళ్లాను.

పళ్లేలు కడుక్కొని వెళ్లి క్యూలో నిలుచున్నాము.

అభిమానంగా వడ్డించే అన్నం కూరలతో తృప్తిగా భోంచేశాము.

తర్వాత పాకశాలలోకి నడిచాము.

అక్కడున్న కూరగాయల రాశుల్ని చూసి ఆశ్చర్యమేసింది.

అన్నీ రైతులు తెచ్చి పోసినవేనట.

కాసిన తొలికాపు కాశినాయనకే.

పండిన తొలిపంటలో కొంత ధాన్యం అన్నదానానికే.

ఆశ్రమానికి వచ్చిన భక్తులెవ్వరూ వూరకే రారుట. బియ్యమూ, బేళ్లూ, కూరగాయలూ... ఎవరికి పండినవి వాళ్లు...

పెద్దపండుగ వచ్చేసరికి ఏ వూరికి ఆ వూరు నాయన ఆశ్రమం కోసం తీసి పెట్టిన ధాన్యపు బస్తాలను సేకరించి ఒకచోటికి చేర్చి ఆశ్రమ నిర్వాహకులకు తెలియ జేస్తే వాళ్లు ట్రాక్టర్ పంపిస్తారుట. ఆశ్రమ తిరునాళ్లకయితే వూరూరా గుంపులు గూడి ఇక్కడికి వచ్చి కట్టెలు కొట్టటం, వంటలు చేయటం, వడ్డించటం, శుభ్రం చేయటం... వగైరా పనులన్నీ చేసిపోతారుట.

వంటశాల, భోజనశాలల్లో ముసలాయన కనిపించలేదు.

ప్రశ్నలేసేందుకు యోగ్యులైన మనుషులు కూడా ఎదురుపడలేదు.

వసతిగృహానికి వెళ్లి విశ్రాంతి తీసుకొన్నాను.

ముసలాయన పదేపదే గుర్తుకొస్తున్నాడు.

యానాది పిల్లాడి మీద ఆగ్రహం చూపిన ఆయన గాండ్రింపులు తరచూ చెవుల్లో వినిపిస్తున్నాయి.

అలాంటి జీవుల్ని ఆహారంగా తీసికోవటం వాళ్లకు సహజమైన విషయమే కావొచ్చు. ఒక జీవిని చంపటం ద్వారా దాని జత జీవి దుఃఖానికి కారణం కాకూడదనే ధర్మం ఒకటయితే, ఆశ్రమ పరిసరాలలో హింస చేయకూడదనే మరో ధర్మం కూడా ఉందని ఆయన తెలియజేశాడు. ప్రకృతి మధ్య బతుకుతున్నపుడు దాన్ని విధ్వంసం చేయకూడదనే సారాంశం కూడా ఆయన చేష్టల్లో వుంది.

నాలుగు గంటల సమయంలో గది నుంచి బైటపడ్డాను.

ఆశ్రమమంతా కలియదిరిగాను.

నాయన సమాధికి తూర్పువైపున పురాతన కాలంనాటి మర్రిచెట్టు వుండేదిట. దాని కొమ్మల్నిండా, వూడల్నిండా కొండముచ్చులు దండిగా వుండేవిట.

నాయన తనువు చాలించిన మూడవరోజున ఏ ఉపద్రవమూ లేకుండానే అంత పెద్ద మర్రిచెట్టు ఫెళఫెళమని విరుచుకుపడిందట. వేళ్లతో సహా పెకలించుకొని నేలకూలిందట.

అదేరోజు నాయన అత్యంత ప్రీతిపాత్రంగా పాలు దాగే ఆవు కూడా తిండి నీళ్లు ఉగ్గబట్టి ప్రాణాలు వదిలిందట.

ఆవుకు సమాధి కట్టి పూజ చేస్తున్నారు గాని మర్రిచెట్టును మరచిపోయారు.

చుట్టూ కోటగోడల్లా కొండలు.

పురాతన వృక్షాల నీడలో జ్యోతిక్షేత్రం.

గుబురుకొమ్మల్లో చివురాకుల నీడన సేదదీరుతోన్న పక్షిలా వుంది ఆశ్రమం. అద్భుతమైన ప్రకృతి సౌందర్యమంతా కుప్పబోసినట్లుంది.

నాయన గుడికి ఉత్తరం వైపున పాత అన్నసత్రం పక్కన కణితి కనిపించింది. ప్రహరీ లోపల్నించి తల నిక్కబెట్టి చూస్తోంది. మంచి పరువంలో వున్న బర్రెపడ్డలా వుంది. చంటిపిల్లను తెచ్చి సాకినట్టున్నారు.

ఉసిరిక చెట్టుకు పడమర రేకుల షెడ్డు పక్కగా చిన్నపిల్లాడితో గోళీలు ఆడుతూ కనిపించాడు ఓ ముసలాయన. గొంతుక్కూచుని మోకాళ్ల మధ్యగా వంగి చేతివేలికి సంధించిన గోలీతో నేలమీదున్న గోలీని 'టఫ్'మని కొట్టాడు. పిల్లగాడు ఆనందంతో చప్పట్లు చరిచాడు. వాడు కూడా ముసలాయనలాగే గోలీని సంధిం చేందుకు ప్రయత్నిస్తున్నాడు.

ఆ ముసలాయన్ను ఇప్పుడే ఎక్కడో చూసినట్లుగా అనిపించింది.

అతనేనేమో! అదే అరచొక్కా!... అదే పుట్టగోచి... అదే ఆకారం... అతనిలాగే వున్నాడు.

కళ్లు పోల్చుకొన్న దాన్ని మనస్సు ఒప్పుకోవటం లేదు.

యానాదుల పిల్లాడి మీద గాండ్రించిన ఆ ఉగ్రరూపానికీ, యీ పిల్లచేష్టలకూ సమన్వయం కుదరక అలాగే నిల్చుని చూస్తుండిపోయాను.

పిల్లగాడితో సహా ఇంట్లోకి వెళ్లిపోయాడు ముసలాయన.

వెనుదిరిగాను.

నాయన గుడికి వాయవ్యమూలన మిద్దెపంచలో అడ్డగోడ లోపల పదిమంది దాకా కూచుని వున్నారు.

దగ్గరగా వెళ్లేసరికి అర్థమైంది. వాళ్లల్లో వాళ్లు ఏదో చర్చించుకొంటున్నారని.

తాపలు ఎక్కి అడ్డగోడకు ఆనుకొని నిల్చున్నాను.

మహాభారతంలో ధర్మవ్యాధుని గురించిన చర్చ.

ముతక చొక్కాలు, గోచి పంచెలు, రుమాలు గుడ్డలు, మాసిన గడ్డాలు... అందరూ పల్లెటూరి రైతుల్లాగే వున్నారు- ఇద్దరు తప్ప. అందులో ఒకాయన పొడవాటి గడ్డమూ కాషాయవస్త్రాలు ధరించి వున్నాడు. మరొకాయన మునీశ్వరుడిలా తలపైన జుట్టు ముడేసుకొని వున్నాడు.

వీళ్లందరికీ తోడుగా- పేర్చిన బస్తాల మీద అడ్డంగా పడుకొని వున్న మరో పెద్దాయన.

"ఎవరు స్వామీ నువ్వు? బైటనే వుండావెందుకు? లోపలికి రా!" కాశినాయన నామం పెట్టుకొని వున్న ముసలాయన పిల్చాడు.

లోపలికి నడిచాను.

"కింద కూకోలేవేమో- అదో ఆ బస్తా వుంది చూడు..." చెప్పాడు.

నా పరిస్థితిని అంచనా వేసినట్టున్నారు.

వెళ్లి కూచున్నాను.

"ఏ వూరు సామీ నీది?" అడిగాడు జుట్టు ముడేసిన మనిషి.

"ప్రస్తుతానికయితే పూనా," చెప్పాను.

"అంత దూరాన్నించి నాయన్ను సూడ్డానికొచ్చినావా?"

"బ్రహ్మంగారి మఠం వచ్చాను. అక్కన్నించి దారి చూపించారు."

"నాయనే సూపింటాడులే... లేకుంటే యాడికేడ?..." ధాన్యపు గోతాల మీద పడుకొన్న మనిషి అన్నాడు.

"లేదు లేదు... ఆరికలు చూపించాయి," చెప్పాను.

"ఎట్లా?" గోతాల మీంచి లేచి కూచున్నాడు పెద్దాయన.

"ఆరిక ధాన్యాన్ని వెదక్కొంటూ వస్తున్నా. వాటి ఆచూకీ ఇక్కడ దొరుకుతుం దేమోనని ఆశతోనే... ఆ ఆశే నన్నిక్కడకు రప్పించింది," అన్నాను.

గడ్డం ముసలాయన తలెత్తి నాకేసి అదోలా చూశాడు.

"అయ్యా చెన్నారెడ్డిగారూ!" అంటూ గొంతెత్తి పిలిచాడు.

"ఎఱ్రసందనం కోసమో, టేకు సామాను కోసమో, కొండతేనె కోసమో, ఎలమ బంక కోసమో, సుగంధప్పాల యేర్ల కోసమో, ఉడుముల కోసమో వొచ్చేవాల్లను సూసినాముగాని ఆరికల కోసం కొండలేకి వొచ్చిన పెద్దమాసుల్ను ఎవుర్నీ సూల్లే... ఆశ్రమానికి వొచ్చింది నాయన కోసం కాదని సెప్పిన మాసినిగూడా సూల్లే... ఆశ్రమాని కంతా పెద్దవు నువ్వు... ధర్మకర్తవు... ఇట్లాంటి మాసి నీకెప్పుడైనా ఎరికేనా?" అడిగాడు.

అతని వ్యంగ్యం అర్థమవుతూనే వున్నా, ధాన్యపుబస్తాల మీద అడ్డంగా పడుకొని వున్న ఆ సాధారణ రైతులాంటి మనిషి ఇంత పెద్ద ఆశ్రమాన్ని నడిపే పెద్దగా తెలిసొచ్చేసరికి ఆశ్చర్యంతో తలమునకలయ్యాను.

బైటకు విన్పించేట్టుగానే చిన్నగా నవ్వాడు చెన్నారెడ్డి.

"ఆయన అవసరం ఆయనది. నాయనకన్నా ఆయనకు ఆరికల్లోనే దేవుడు కనిపిస్తండాడేమో!... అయినా నీకు ఆరికలెందుకయ్యా? బువ్వకేనా?" అడిగాడు నన్నుద్దేశించి.

"వైద్యం కోసం పెద్దాయనా!" చెప్పాను.

"ఆరికెలతో వైద్యమా? మేమెప్పుడూ వినలేదే..." కాషాయ వస్త్రాలు ధరించిన వ్యక్తి అన్నాడు.

"ఏ జబ్బుకైనా మాత్రలు, ఇంజక్షన్లు ఉన్నాయి గదా!"

"అన్నీ అయ్యాయి. వేటికీ లొంగలేదు నా జబ్బు..." చెప్పాను.

"ఇంతకూ... ఏం జబ్బో?"

"షుగరు..."

కొంతసేపు మౌనంగా వుండిపోయాడు చెన్నారెడ్డి.

"మందులకు లొంగనంత ముదిరిందా?" అంటూ నిట్టూర్చాడు.

"ఇంత లావు జబ్బుకు ఆరికల్లో మందు దొరుకుతాదని మాకు తెల్దు. నా చిన్నతనమంతా ఆరిక బువ్వ తినే బతికింది."

"అందుకే మీ తరపు మనుషుల్లో షుగరు జబ్బు లేదు," చెప్పాను.

"ఉయం నించీ ఎంక్వయిరీ చేస్తూనే ఉన్నా. చాలామందికి ఆరికల గురించి తెలియదు. తెలిసినవాళ్లు మీలాగే చిన్నతనాన చూసినవాళ్లే. నాక్కావలసింది ఇప్పు డెవరన్నా సాగు చేస్తున్నారా అని," అన్నాను.

"ఇప్పుడెవరు పండిస్తారు?" చెన్నారెడ్డి అన్నాడు. "పంట పండిస్తే పండిస్తారు గాని దాన్ని కల్లం జెయ్యడం పెద్ద పని. గింజలు రాలగొట్టి ఇంటికి తెచ్చినా వాటెను

బియ్యం జెయ్యడం అలవిగాని పని. వాటేలి ముండమొయ్య- దంచాలనుకొంటే రోట్లో నిలబడవు. కొఱ్ఱలకు బరిగెలకు వున్నెట్టు మిషన్లు వుండవు. విసఱ్ఱాయి పొందించి పై రాతికి కింది రాతికి లోపల పక్క బంకమట్టి పూసి ఆరనిచ్చి ఆరికెలు పోసి విసరాల. మల్ల దంచాల. గింజెమీది పొట్టు బో బలమైందిలే నాయనా! దిబ్బలో పోస్తే ఎరువు తిరగదోలేప్పుడు సూజ్జుంగదా- గడ్డి గాదమూ కడాకు కందిపొట్టు కూడా కుళ్లిపోయింటది గాని దీనెమ్మ కడుపుగాల ఆరికె పొట్టు కుల్లదే..." చెప్పాడు.

"చరిత్ర అడగలే... ఎవురన్నా పండిస్తండారా లేదా అని అడిగిండు," జుట్టు మనిషి అన్నాడు.

"ఎవురుండారు ఇంగా అంత మొరటు మాసులు? ఎవురన్నా ఆ కొండల్లోపల ఇగ్గులాడ్తా వుండారేమో!"

"మన వొంటికొట్టం నర్సయ్యను అడిగితే తెలుస్తాదా?" నామం పెట్టుకొన్న ముసలాయన అన్నాడు.

"ఆ... తెలవొచ్చు... ఏడీ?"

"అదో... ఆ కుంటిపిల్లోని యింటికాడ వాని కొడుకుతోనేమో గోలుగుండ్లు ఆడతా వుండెనే..." గడ్డం మనిషి అన్నాడు.

ఉలిక్కిపడ్డాను.

నేను చూసింది అతన్నే అన్నమాట.

"ఇంగా యాడుంటాడు? ఆవులు దొడ్లకు జేరుకొనే జామయిన్లే!... వాటికాడికి పోయింటాడు. రేత్రికొస్తాడులే సామీ!... నీ పేరేం పేరో?"

"రాఘువ," చెప్పాను.

"సగం రేత్రిదాకా మేమిక్కడ అదో... ఆ అన్నపూర్ణేశ్వరి గుడి ముందు పురాణం సదువుతా వుంటాం. ఆయప్ప గూడా మాలో మాసే..." గడ్డం మనిషి చెప్పాడు.

"పురాణాలంటే రామాయణం, మహాభారతం పద్యకావ్యాలూ... వాటిని చదవడం... విడదీసి అర్థం చెప్పటం..." సంశయిస్తూ ప్రశ్నార్థకంగా చూశాను. వాళ్ల వేషానికీ పద్యకావ్యాలకూ వాళ్ల పల్లెయాస మాటలకూ పొంతన కుదిరినట్లు అనిపించ లేదు.

"ఏదో అట్లా అలబాటయ్యిందిలే సామీ! మరీ అంత యిదిగా సూడగాకులే..." అన్నాడు నవ్వుతూ జుట్టు ఎగగట్టిన మనిషి.

నిజంగానే- ఆశ్చర్యంగా వుంది.

చెప్పినా నమ్మకం కలగని విధంగా వుంది.

పక్కా పల్లెటూరి రైతుల్లాగున్నారు.

చదువు సంధ్యలు ఎరుగని వాళ్లలా కనిపిస్తున్నారు.

వింతే...

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Ontari**

* * *